జీడి పిక్కలను దోచేస్తోన్న దళారులు..!

వెలవెలబోయిన కొనుగోలు కేంద్రాలు...



విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : జీడి పంట గిరిజనులకు అధిక సంఖ్యలో ఆదాయం తెచ్చిపెట్టే ప్రధానమైన పంట. చాలావరకు ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరి పుత్రులు పోడు భూముల్లో వ్యవసాయం ద్వారా జీడి పంటను సాగు చేస్తున్నారు. వాతావరణం సహకరిస్తే జీడి పంట ఆ రైతుకు లక్షలు ఆదాయాన్ని తెచ్చిపెడుతుంది. ఈ ఏడాది పూత దశలోనే ప్రకృతి సహకరించక పోయిన ప్పటికీ పంట మాత్రం ఆశాజనకంగా వచ్చిందని చెప్పాలి. ఈ తరుణంలోనే ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన దళారులు గిరిజనులకు ముందస్తుగానే పెట్టుబడి రూపంలో కొంత నగదును ముట్టచెప్పి ఆయా తోటలను వారి ఆధీనంలోకి తీసుకున్నారు. వచ్చిన పెద్ద గొప్ప పంటను ముందస్తుగానే సేకరించి గిరిజనుల నుంచి దళారులు దోచుకెళ్లిపోయారు. ఏదాది ప్రభుత్వం జీడిపంట ఎక్కడికక్కడ కొనుగోలు చేస్తామని ముందస్తుగానే ప్రకటిస్తున్నప్పటికీ అది కార్యచరణ దాల్చే లోపు పూర్తి పంటను దళారులు దోచుకుని ఇతర ప్రాంతాలకు తరలించేశారు. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది జీడి ధర కూడా బహిరంగ మార్కెట్లో ఆశాజనకంగా ఉండడంతో రైతులు ముందస్తుగానే వీటిని విక్రయాలు చేసేసారు. గిట్టుబాటు ధర కింద ప్రభుత్వం కేజీ 150 నుంచి 155 రూపాయలు ప్రకటించే లోపే దళారులు రైతులు వద్ద నుంచి 140 నుంచి 145 రూపాయలకు జీడిపిక్కలను సేకరించి ఇతర ప్రాంతాలకు తరలించేశారు. ఈ ప్రక్రియ అంతా ప్రభుత్వం క్షేత్రస్థాయిలో జీడి పిక్కల కొనుగోలు కేంద్రాలను గ్రామస్థాయిలో ప్రారంభించక ముందే దళారులు రైతులు వద్దకు నేరుగా వెళ్లి వారికి డబ్బులు చెల్లించి వారి వద్ద నుంచి పిక్కలను సేకరించేశారు. ఈ ప్రాంతం లో వందలాది హెక్టార్లలో జీడి పంట ఉంది. వాటి నుంచి అనేక టన్నుల జీడిపిక్క ఉత్పత్తి అవుతుంది. కేవలం ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్ల దళారుల చేతుల్లో గిరిజనులు మోసపోయారని, ఇప్పటికే ప్రజా సంఘాలు పత్రికల ముఖంగా ఆరోపిస్తున్నాయి. జిల్లాలో మొత్తం 68 వేల ఎకరాల్లో జీడిపంట ఉందని, ప్రభుత్వం ముందస్తుగా గిట్టుబాటు ధరను 200 ప్రకటిస్తే జీడి రైతులు ఆశాజనకంగా ఉండునని వారు అంటున్నారు. రైతుల వద్ద నుంచి జీడి పిక్కల కొనుగోలు కోసం ఆయా విడివికెలకు నామమాత్రంగా నిధులు కేటాయించారని ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో జిల్లా కలెక్టర్ చొరవతో ఏర్పాటు చేయనున్న జీడీపిక్కల ప్రాసెసింగ్ యూనిట్ ఏవిధంగా జరుగుతుందని వారు ప్రశ్నిస్తున్నారు. ఏదేమైనా ప్రస్తుతం వీడి వీకే కేంద్రాలు సేకరించిన జీడి పిక్కలను ప్రాసెసింగ్ చేసి వచ్చే ఏడాది నుంచేనా ముందస్తు ప్రణాళికతో దళారీ వ్యవస్థ లేకుండా జీడి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

వర్షాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

ఇన్‌ఛార్జ్ జిల్లా కలెక్టర్ ఎస్ ఎస్ శోభిక

విశాలాంధ్ర-పార్వతీపురం : వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇన్ ఛార్జ్ జిల్లా కలెక్టర్ ఎస్ ఎస్ శోభిక తెలిపారు. వాతావరణ శాఖ విడుదల చేసిన సూచనల మేరకు జిల్లా అధికారులతో ఆదివారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఎల్లో అలెర్ట్ ను వాతావరణ శాఖ ప్రకటించిందని ఆమె చెప్పారు. భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని, గాలులు 60 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచనలు చేసిందన్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. భారీ వర్షాలు కారణంగా ఆకస్మికంగా వరదలు సంభవించే ప్రదేశాలు గుర్తించి అటువంటి ప్రదేశాల వద్ద అప్రమత్తం చేయాలని ఆదేశించారు. రహదారులు, కల్వర్టు పైనుండి నీరు పారే చోట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్యం పాటించాలని, వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

నవోదయం 2.ఓ పై అవగాహన

విశాలాంధ్ర-సీతానగరం: ఎక్సైజ్ ఉన్నత అధికారుల ఆదేశాలమేరకు సీతానగరంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మెయిన్ రోడ్ నుండి జంక్షన్ వరకు నాటుసారాయి త్రాగడం వల్ల కలిగే అనర్థాలను తెలియజేస్తూ ర్యాలీని నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమం ద్వారా నవోదయం 2.0 కార్యక్రమం గూర్చి అవగాహన కల్పించారు. ఈర్యాలీలో విద్యార్థులు, స్థానిక ప్రజలు, ఎక్సైజ్ సీఐ, డి.పద్మావతి, ఎస్ఐ షరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

వాతావరణ హెచ్చరికలపై అప్రమత్తమైన రెవెన్యూ శాఖ

విశాలాంధ్ర-పాచిపెంట: వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రెవెన్యూ తహసిల్దార్ ప్రభుత్వ ఉద్యోగులను అప్రమత్తంగా ఉండాలని సందేశాలు జారీ చేశారు. కలెక్టర్ జాయింట్ కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంపై మండల యంత్రాంగాన్ని అప్రమత్తంగా ఉంచాలని వి సి ద్వారా తెలియ చేయడంతో స్థానిక తాసిల్దార్ బి రవి మండల అధికారులను అప్రమత్తం చేశారు వీఆర్వోలు పంచాయతీ సిబ్బంది స్థానికంగా ఉండే ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యగా గ్రామాలలో టామ్ టామ్ వేయించాలని అన్నారు. ఈదురుగాలులతో విద్యుత్ వైర్లు తెగే ఆస్కారం ఉన్నందున విద్యుత్ శాఖ సిబ్బంది అలసత్వం వహించకుండా అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు పిడుగులు పడే అవకాశం ఉన్నందున పశువుల కాపరులు గొర్రెల కాపరులను కూడా అప్రమత్తం చేయాల్సిన బాధ్యత పంచాయతీ సిబ్బంది వీఆర్వోలపై ఉందని వెంటనే అప్రమత్తం చేయాలని ఆదేశాలు జారీ చేశారు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తుగా పై అధికారులు ఆదేశాల మేరకు ఆయా పంచాయతీలలో ఉండి సేవలందించాలని కోరారు.

నాటుసారా నివారణ కోసం అవగాహన

విశాలాంధ్ర-సీతానగరం: డిప్యూటీ, అసిస్టెంట్ కమిషనర్ ఆదేశాల మేరకు నవోదయం 2.O కార్యక్రమంలో భాగంగా ఆదివారం గరుగుబిల్లి మండలంలోని బురదవెంకటపురం గ్రామం లో నాటుసారాయి తాగడంవల్ల జరిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని ఎక్సైజ్ సీఐ పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ సిబ్బంది, గ్రామపెద్దలు, యూత్ మెంబెర్స్ పాల్గొన్నారు .నాటుసారాయి అమ్మకాలు నిర్మూలన ధ్యేయంగా రెవెన్యూ మరియు పోలీసు అధికారులసహకారంతో నిరంతర నిఘా మరియు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని ప్రోహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ సీతానగరం డి పద్మావతి తెలిపారు. నాటుసారా నివారణకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పొంచి ఉన్న ప్రమాదం

విశాలాంధ్ర-పార్వతీపురం రూరల్ : మండలంలోని పెదబొండపల్లి - పుట్టూరు గ్రామాల మధ్య రహదారి కోతకు గురైంది. గ్రామ శివారులో గల మలుపు వద్ద రోడ్డు తీవ్రస్థాయిలో కోతకు గురవడంతో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కోతకు గురైన ప్రాంతంలోనే రోడ్డు కూడా మలుపు ఉండడంతో ఏ నిమిషంలో ఏ ప్రమాదం జరుగుతుందో, ఏ వాహనం బోల్తా పడుతుందోనని భయంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు స్పందించి కోతకు గురైన ప్రాంతంలో హెచ్చరిక బోర్డు గాని ప్రత్యేక ఏర్పాట్లు గాని చేయాలని వారు అంటున్నారు.

అర్హులు ఇంటి స్థలం కోసం దరఖాస్తులు చేసుకోవాలి

తాసిల్దార్ సాయి కామేశ్వరరావు



విశాలాంధ్ర-కొమరాడ: మండలం లోని 31 పంచాయతీ లలో ఇప్పటి వరకు ఇళ్ళు లేని నిరుపేదలు ఇంటి స్థలం కోసం ధరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ ఏ సాయి కామేశ్వరరావు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ళు లేని నిరుపేదలకు ఇళ్ళు నిర్మించుకునేందుకు ముందుగా ఇళ్ళ స్థలాలు మంజూరు కు ధరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించిందని అర్హులైన పేదలందరూ గ్రామ సచివాలయం వెళ్లి ధరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు

పిహెచ్‌సీల్లో ప్రసవాల మెరుగుకు కృషి చేయాలి

డిఎం&హెచ్ఓ డాక్టర్ భాస్కరరావు

విశాలాంధ్ర-బెలగాం: మాతా, శిశు వైద్య సేవలు, పిహెచ్సీ ప్రసవాలు మెరుగుకై స్టాఫ్ నర్సులకు ఎస్బిఎ శిక్షణ నిర్వహించడం జరిగిందని, ఆ దిశగా కృషి చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు స్పష్టం చేశారు. ఈ మేరకు ఎస్బిఎ శిక్షణ పూర్తి చేసుకున్న పిహెచ్సీ స్టాఫ్ నర్సులకు ధ్రువపత్రాలను శనివారం సాయంత్రం ఆరోగ్య కార్యాలయంలో అందజేశారు. శిక్షణా నైపుణ్యాన్ని సద్వినియోగం చేయాలని డిఎంహెచ్ఓ వారికి సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గర్భిణీల వైద్య సేవలను మరింతగా మెరుగు పరిచే లక్ష్యంగా, పిహెచ్సీలలో సాదారణ ప్రసవాలు ఎక్కువగా జరిగేలా కృషి చేసే దిశగా స్టాఫ్ నర్సులకు ఎస్బిఎ (స్కిల్డ్ బర్త్ అటెండెంట్) రీఓరియంటేషన్ శిక్షణను నిర్వహించామని ఫిబ్రవరిలో ప్రారంభించి బ్యాచ్ ల వారీగా ఏప్రిల్ నెలాఖరు వరకు కొనసాగించడం జరిగిందని ప్రతీ బ్యాచ్ కు 21 రోజులు శిక్షణ ఇవ్వడం జరిగినదని, ఇందులో ఒక వారం ఆరోగ్య కార్యాలయంలో, రెండు వారాలు జిల్లా ఆసుపత్రిలో గైనకాలజిస్ట్, పిల్లల వైద్య నిపుణులు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. హైరిస్క్ ఆరోగ్య సమస్యలు ముందుగా గుర్తించడం, ప్రసవ సమయం లో తలెత్తే సమస్యలు నివారించడం, సురక్షిత ప్రసవం, శిశువుకి ప్రాథమిక, అత్యవసర సంరక్షణ అందించడం మొదలగు అంశాలపై శిక్షణ పూర్తి చేయడం జరిగిందన్నారు. పిహెచ్సీ ప్రసవాలు మెరుగు పడేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఐఓ డా ఎం. నారాయణరావు, డిప్యూటీ డిఎంహెచ్ఓ డా. కెవిఎస్ పద్మావతి, ప్రోగ్రాం అధికారులు డా. టి. జగన్మోహనరావు, డా. పిఎల్ రఘుకుమార్, డిపిహెచ్ఎన్ఓ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు లోఓల్టేజి సమస్యకు పరిష్కారం

మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కి గ్రామస్తులు కృతజ్ఞతలు



విశాలాంధ్ర-మక్కువ : ఎంతోకాలంగా లో ఓల్టేజి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం దొరికింది. మండలంలోని కోన పంచాయతీ గోపాలపురం గ్రామ ప్రజలు దీర్ఘకాలంగా కరెంటు లోవోల్టేజ్ సమస్యతో గత ప్రభుత్వం నుంచి కూడా పలుమార్లు విద్యుత్ ఉన్నత అధికారులకుమొరాయించుకున్నప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి బాధ్యతలు చేపట్టిన వెంటనే, గ్రామ పంచాయతీ సర్పంచ్ బొత్స కన్నంనాయుడు విద్యుత్ సమస్యను టిడిపి మండల పార్టీ అధ్యక్షులు వేణుగోపాలనాయుడు, దృష్టిలో పెట్టగా వెంటనే స్పందించి సర్పంచ్ కన్నం నాయుడు మరియు వేణుగోపాల్ నాయుడు మంత్రికి గ్రామంలో దీర్ఘకాలంగా విద్యుత్ సమస్యను తెలిపిన వెంటనే ఆమె స్పందించి, విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి గోపాలపురం గ్రామ దేవత పండగలోపు విద్యుత్ సమస్యను లేకుండా చూడాలని అధికారులకు ఆదేశించగా, వెంటనే స్పందించి విద్యుత్ శాఖ అధికారులు పనులు ప్రారంభించి ఆదివారం టిడిపి మండల పార్టీ అధ్యక్షులు గుల్ల వేణుగోపాల్ నాయుడు చేతుల మీదుగా ప్రారంభోత్సవ కార్యక్రమం చేపట్టడం జరిగింది. గ్రామంలో తాగునీటిసమస్య కోన గోపాలపురం గ్రామంలో తాగునీటి సమస్య గురించి మంత్రి సంధ్యారాణి దృష్టిలో పెట్టగా వెంటనే స్పందించి పది లక్షల రూపాయలు మంజూరు చేసి బోరు మరియు మోటర్ సౌకర్యం కల్పించడం జరిగిందని గోపాలపురం సర్పంచ్ తెలిపారు, నేటి నుంచి జరుగుతున్న గ్రామదేవత పండగకు ఇటు విద్యుత్ సమస్య అటు త్రాగునీటి సమస్య తీర్చినందుకు గ్రామ ప్రజలు గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

జిఓ-3 సాధనకై మన్యం బందుపై కూటమి నేతలు ప్రేలాపన సరికాదు

ప్రజా, ఉద్యోగ , ఉపాధ్యాయ, గిరిజన ,నిరుద్యోగ సంఘాల నేతలు

విశాలాంధ్ర-పాడేరు: జి ఓ 3 సాధనకై ఇటు మన్యం జిల్లా మొదలు కొని అటు , అల్లూరి సీతారామరాజు జిల్లా, రంపచోడవరం వరకు గిరిజన, ప్రజా,ఉద్యోగ ఉపాధ్యాయ, నిరుద్యోగ సంఘాలతో పాటు అన్ని రాజకీయ (కూటమి నేతలు తప్ప) పార్టీలకు అతీతంగా గత రెండు రోజులుగా నిరవధికంగా ఆందోళన ఉద్రిక్తం చేస్తూ కూటమి ప్రభుత్వం పై నిరసన సెగ , నిరుద్యోగులు ఆందోళన బాట విజయ వంతంగా పట్టారు. మొదటి రోజు ఆందోళన చూసి స్వయానా రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఆందోళన బాట విరమించాలని, జి ఓ:3 కి బదులుగా ప్రత్యామ్నాయంగా చూస్తామని చెప్పిన ఆందోళన కారులు స్పష్టమైనా హామీ ఇచ్చే వరకు ఆందోళన ఉద్రిక్తం చేస్తామని,2 వ రోజుకూడా ఆందోళనకు పిలుపు ఇచ్చారు. మొదటి రోజు మాదిరిగానే 2 వ రోజు కూడా ఆందోళక ఉద్రిక్తం చేశారు. కాగా ఆందోళన వివిధ రూపాల్లో చేస్తామని చెప్పడంతో జిల్లా కలెక్టర్ ద్వారా శాంతి చర్చలకు పిలుపు ఇచ్చారు. దీంతో శాంతి చర్చలు ఒప్పందం కుదిరింది. దీంతో తాత్కాలికంగా ఆందోళన విరమించారు. ఇంతవరకు బాగానే ఉన్నపటికీ కూటమి నేతలు ఒక్క వైసీపీ పార్టీకి టార్గెట్ చేస్తు ఆందోళనలో పాల్గొన్న వారందరినీ కించపరిచేటట్లు పాడేరు, అరకు విశాఖ నుండి మీడియా సమావేశాలు పెట్టి కూటమి ప్రభుత్వం ద్వారానే సాధ్యం అవుతుందని. ప్రలోభాలకు తలొగ్గి రోడ్ల మీద వచ్చి ఆందోళన చేయడం ఏమాత్రం సరికాదని చెప్పడం వెనుక అంతర్యం ఏమిటని, పార్టీలకు అతీతంగా, ఉద్యమంలో పాల్గొని ఉధృతం చేశారనీ , ప్రజా సంఘాలు, ఉపాధ్యాయ, ఉద్యోగ, గిరిజన సంఘాలు, నిరుద్యోగ యువత అధిక సంఖ్యలో పాల్గొని కూటమి ప్రభుత్వం పై నిరసన సెగ చేసే జీర్ణించుకోక తప్పుడు పేలపాన చేయడం సరికాదని, కూటమి నేతలకు చేతికి ఆందోచిన పిల్లలు లేరా....? వారికి ఉద్యోగాలు అవసరం లేదా...? కూటమి ప్రభుత్వం మీ పిల్లలకే భవిష్యత్ ఇస్తుందా...? ఇప్పుడు ప్రకటించిన డి ఎస్ సి ద్వారా కూటమి నేతల పిల్లలందరికీ ఉపాధ్యాయ అర్హత కలిగించి కూటమి ప్రభుత్వం ద్వారానే సాధ్యం అవుతుందని చెప్పి నిరూపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండిపడ్డారు. కూటమి నేతల వైఖరి ఏమిటో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. పేలాపన కూతలు మానుకొని గిరిజనులంత ఒకటే అని రాబోయే కాలంలో చేయబోయే ఉద్యమాలకు సహకరించాలని, లేని పక్షాన గిరిజన ద్రోహులుగా మిగిలిపోతారని ఆందోళనలో పాల్గొన్న నేతలు కూటమి నేతల వైఖరి పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బంద్ విరమణకు గిరిజన సంఘాలు అంగీకారం

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు: జిఒ నంబర్ మూడు ను పునరుద్ధరణ చేయాలని, గిరిజన ప్రాంతాలలో ఖాళీలు గిరిజనులతోనే భర్తీ చేయాలని వివిధ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి చేపట్టిన మన్యం బంద్ సందర్భంగా అల్లూరి జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ గిరిజన సంఘాలతో రెండు దఫాలుగా జరిపిన చర్చలు జరిపారు. దీంతో సంఘాల నేతలు బంద్ విరమించటానికి అంగీకరించారు. ముందుగ ఆయా సంఘాల డిమాండ్లు, కోరికలను విన్న కలెక్టర్ మాట్లాడుతూ సుప్రీమ్ కోర్ట్ రాజ్యాంగ ధర్మాసనం జీవో నెంబర్ 3 రాజ్యాంగ విరుద్ధమని ప్రకటిస్తూ తీర్పు వెలువరించినందున సుప్రీమ్ కోర్ట్ తీర్పు తరువాత ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంతాలలో నియామక విధానాలను పున : పరిశీలించి సవరించవలసి ఉందన్నారు. ఆ జీఓ ను అమలు పరచడంలో న్యాయపరమైన చిక్కులు లేకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ఏజెన్సీ ప్రాంతాలలో గిరిజనులకు న్యాయం చేయడానికి పరిశీలిస్తోందన్నారు. ప్రస్తుత బంద్ వల్ల చిన్న, మధ్య తరగతి ప్రజలు, చిరు వ్యాపారులు తీవ్ర నష్టానికి అసౌకర్యానికి గురి అవుతున్నందున బంద్ వాపస్ తీసుకోవాలని కలెక్టర్ కోరడంతో గిరిజన సంఘాల నేతలు సమ్మె విరమణకు అంగీకరించారు.

కాకరపాడు గురుకుల కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం ప్రిన్సిపల్ 'ఎస్ జగన్నాథ రావు'

విశాలాంధ్ర-కొయ్యూరు: కొయ్యూరు మండలం లోని కాకరపాడు (కొయ్యూరు) గిరిజన సంక్షేమ శాఖ గురుకుల జూనియర్ కళాశాల (బాలురు)లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు గాను అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎస్ జగన్నాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2025 -26 విద్యా సంవత్సరంలో ఎంపీసీ, బైపిసి, సీఈసీ గ్రూపులకు సంబంధించి కళాశాలలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని ప్రిన్సిపల్ తెలియజేశారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 18వ తేదీ లోగా ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ తెలిపారు. వివరాలకు 8500 333 03 నంబర్ను సంప్రదించాలని ప్రిన్సిపల్ జగన్నాథరావు తెలియజేశారు.

పట్టాసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత విద్య శిబిరం

పట్టాసి ఫౌండేషన్ ప్రతినిధి చలపతిరావు

విశాలాంధ్ర-అరకులోయ: ఈ నెల 5, 6, 7 తేదీలలో ప్రతి రోజు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పటాసి ఫౌండేషన్ ప్రతినిధి చలపతిరావు ఒక్క ప్రకటనలో పేర్కొన్నారు. 5 వ తేదీన యండపల్లి వలస గ్రామం లో,6 వ తేదీ నా బొడుగూడ గ్రామంలో,7 వ తేదీ నా రణజిల్లేడా గ్రామంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ వివైద్య శిబిరానికి విశాఖ పట్నం నుంచి విద్య నిపుణులు డా.రవిశంకర్ ఏండి జనరల్ మెడిసిన్ మరియు వారి బృందం రోగులకు ఉచిత వైద్య సేవలు మరియు మందులు అందజేయబడుతుంది అని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని అరకులోయ మండల ప్రజలు ఉపయోగించు కోవాలని పట్టాసి ఫౌండేషన్ ప్రతినిధులు పట్టాసి చలపతి రావు,జగ్జీవన్ రావు,పీపీ నారాయణ,సునీల్ కుమార్ లు కోరారు.

మొబిల్ ఆధ్వర్యంలో అన్ ఫర్గెటబుల్ మెమోరీస్ టీవీసీ ఆవిష్కరణ

విశాలాంధ్ర-విశాఖపట్నం: భారతదేశంలో మొబిల్ బ్రాండెడ్ లూబ్రికెంట్లను మార్కెట్ చేస్తున్న, ఎక్సాన్‌మొబిల్ అనుబంధ సంస్థ అయిన ఎక్సాన్‌మొబిల్ లూబ్రికెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ఈరోజు తన కొనసాగుతున్న 'అన్‌ఫర్గెటబుల్ జర్నీస్' ప్రచారంలో భాగంగా తన కొత్త టీవీ సీను ప్రారంభించింది. తాజా ప్రచారం ప్రపంచంలోని ప్రముఖ సింథటిక్ ఇంజిన్ ఆయిల్ బ్రాండ్ అయిన మొబిల్ 1 టీఎం ను ప్రముఖంగా చాటిచెబుతుందని ఎక్సాన్‌మొబిల్ లూబ్రికెంట్స్ డైరెక్టర్ చార్లీన్ పెరీరా అన్నారు. ఈ టీవిసి ప్రచారంలో బాలీవుడ్ ఐకాన్ హృతిక్ రోషన్ నటించారన్నారు. ఈ వాణిజ్య ప్రకటన, హృతిక్ డ్రైవ్, కలలు కనేవారు, విజయసాధకులు ఉన్న భారతదేశం మరియు మొబిల్1 పనితీరు మధ్య శక్తివంతమైన సినర్జీని ఆకర్షిస్తుం దన్నారు. ఇవన్నీ ఉమ్మడి అభిరుచి, నిరంతర శ్రేష్ఠత సాధన ద్వారా మిళితమయ్యాయన్నారు. తాజా వాణిజ్య ప్రకటన బాలీవుడ్ ఐకాన్ హృతిక్ రోషన్, అతని తండ్రి, భారతీయ చలనచిత్ర నిర్మాత, దర్శకుడు రాకేష్ రోషన్‌లను మొదటిసారిగా తెరపైకి తీసుకువస్తుందన్నారు. దశాబ్దాలుగా, మొబిల్ వన్ అత్యంత కఠినమైన పరిస్థితులలో-ప్రయోగశాలలో పరీక్షించబడిన, రోడ్డుపై నడిచే మరియు ట్రాక్-నిరూపితమైన పనితీరును నిరూపించిందన్నారు. గణనీయమైన మైలేజ్ తర్వాత ఇంజిన్లు ఇప్పటికీ అద్భుతమైన స్థితిలో ఉన్నాయని చెప్పారు.

ఈకేవైసీ గడువును పెంచడం పై కృతజ్ఞతలు

జీకే వీధి బిజెపి మండల అధ్యక్షులు కాకురి శేఖర్

విశాలాంధ్ర-జి కె వీధి: ఈ కేవైసీ గడువు ముగిసినప్పటికీ, రేషన్ కార్డు దారులకు ప్రభుత్వం తీపి కబురు తెలిపిందని ఈ కేవైసీ చేసుకునేందుకు గడువును పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందుకు ప్రభుత్వానికి,తాసిల్దార్,జిల్లా అధికారు లకు జీకే వీధి బిజెపి మండల అధ్యక్షులు కాకూరి శేఖర్ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. గూడెం కొత్త వీధి మండలంలో 16 పంచాయితీలో ఇంకా చాలామంది ఈ కేవైసీ చేయించుకోలేదని.ఈ కేవైసి గడువు పెంచమని వివిధ పత్రికల్లో ప్రకటనలు ఇవ్వడం జరిగింది. అది గమనించిన ప్రభుత్వ అధికార యంత్రాంగం రెండు నెలలు గడువును పెంచడంతో ఏజెన్సీఉన్న మారుమూలల గ్రామాల్లో ఉన్న ప్రతి రేషన్ దారుడు జూన్ 30వ తేదీ వరకు ఈ కేవైసీ చేయించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి రేషన్ లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఏజెన్సీలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు

రహదారులపైనే నిలిచిన వర్షపు నీరు

చెత్తా చెదారంతో నిండిన మురుగు కాలువలు

విశాలాంధ్ర-చింతపల్లి: చింతపల్లి ఏజెన్సీలో అకాల వర్షాలు కురుస్తున్నాయి. శనివారం మధ్యాహ్నం నుంచి అడపా దడపా ప్రారంభమైన వర్షపు చినుకులు, చిలికి చిలికి గాలి వానలా మారి ఆదివారానికి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షంగా మారింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు తోడు ఈదురు గాలులతో పాటు, ఉరుములు, మెరుపులు తోడయ్యాయి. వర్షంతో పాటు పిడుగులు పడడంతో మన్యవాసులు ఉలిక్కిపడ్డారు. పిడుగులు ఎక్కడ తమపైన, తమ గృహాలు పైన పడతాయోనని భయాందోళనలు చెందారు. గృహ పరిసరాలలో ఉన్న చిన్నపాటి వృక్షాలు ఈదురు గాలులకు నేల కూలి, తమ గృహాలపై పడతాయేమోనన్న భయంతో గ్రామస్తులు ఆందోళనలు చెందారు. ఇలా ఉండగా గత వారం రోజులుగా ఎండలతో అల్లాడిన మన్య ప్రాంత వాసులు ఆదివారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా వేసవి తాపం నుంచి ఉపశమనం పొందారు. నిన్న మొన్నటి వరకు వేడిగా ఉన్న ఏజెన్సీ వాతావరణం శని, ఆదివారాలలో కురిసిన వర్షాలతో మన్య ప్రాంతం చల్లబడింది. దీంతో ఏజెన్సీ వాసులు ఎండ వేడిమి నుంచి కాస్త సేద తీరారు. చింతపల్లి ఏజెన్సీ లోనీ లోతుగెడ్డ, లంబసింగి, తాజంగి, గూడెం కొత్త వీధి మండలంలోని పెదవలస, రింతాడ, జెర్రెల గూడెం, సప్పర్ల , దారకొండ, సీలేరు తదితర ప్రాంతాల్లోను ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చింతపల్లి గ్రామం లోని పలు వీధులు, వర్షపు నీరుతో నిండి పోయాయి. రహదారులపై పారుతున్న వర్షపు నీరు మురుగు కాలువ లోకి వెళ్లలేక రహదారుల పైనే పారింది. మురుగు కాలువల లో చెత్తాచెదారం పేరుకు పోవడంతో కాలువల్లో ఉన్న నీరు దిగువ ప్రాంతాలకు వెళ్లకపోవడంతో, మురుగు కాలువలలో ఉన్న వర్షపు నీరు ఎక్కడకక్కడే నిలచిపోయింది. అదే క్రమంలో వర్షపు నీరు రహదారులపై ప్రవహించడం తో కాలి నడకన, రోడ్డుపై నడిచే పాదాచారులు ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురుగు కాలువలలో చేరిన చెత్తాచెదారాన్ని తొలగించి వర్షపు నీరు కాలువల గుండా పోయే వెసులుబాటు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

మంచినీటికై నువుమామిడి గ్రామస్తుల క'న్నీటి'వెతలు!

విశాలాంధ్ర-గంగవరం: గంగవరం మండలం. నువుమామిడి గ్రామంలో. దశాబ్దాలు, దాటిన, రాజకీయ నాయకులు మారిన, ప్రభుత్వాలు మారిన ఇప్పటికీ మంచినీటి దాహం తీరలేదని చెప్పుకోవాలి.మినిటేంక్ ఏర్పాటు చేసినప్పటికి నీరు అందానిపరిస్థితి చేతి బోర్లు ఉనప్పటికి అవికూడా నిష్ప్రయోజనంగా పడి ఉంది. తాగునీరు లేక ఒక కిలోమీటరు దూరం వెళ్లి కలుచితమైన వచ్చేనీళ్లను.పట్టుకొని వాటిని తీసుకోనివచ్చి దాహాన్ని తీర్చుకుంటున్నారు. వాటివల్ల అనారోగ్యానికి గురవుతున్నారు ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి గ్రామానికి. త్రాగే మంచినీటి సౌకర్యం కల్పిస్తారని గ్రామస్తులు తెలియజేశారు.లేని పక్షంలో సంబంధిత ఆఫీసు వద్ద. బిందెలతో ఆందోళన. కార్యక్రమం చేపడతామని. నువుమామిడి గ్రామ ప్రజలు హెచ్చరిస్తున్నారు.

స్థాపితం: 1952
విశాలాంధ్ర
తెలుగు జాతీయ దినపత్రిక
విలేకరులు కావలెను
విశాలాంధ్ర దినపత్రికకు
అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఈ కింది తెలపబడిన
మండలాలకు విలేకరులు కావలెను. విశాలాంధ్రలో
జర్నలిస్టుగా పనిచేయాలన్న ఆసక్తి గల వారికి అవకాశం కల్పించబడును.
కావాల్సిన ప్రాంతాలు :
డుంబ్రిగుడ. అడ్డతీగల
సంప్రదించవలసిన నెం :
డి.యర్రయ్య.రెడ్డి, జిల్లా బ్యూరో చీఫ్
7989138129

రైతు శిక్షణా కేంద్రంగా స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానం

ఏడి ఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి

విశాలాంధ్ర-చింతపల్లి : స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానాన్ని ఉన్నత పర్వత శ్రేణి గిరిజన మండలాల్లో రైతులకు ఉపయోగపడేలా సాంకే తిక శిక్షణా కేంద్రంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి అన్నారు. స్థానిక పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ సంప్రదాయ పంటలను సంరక్షిస్తూనే గిరిజనులకు అధిక ఆదాయాన్నిచ్చే సంప్రదాయేతర పంటల సాగుకు సంబంధించి పరిశోధనలు ముమ్మరం చేస్తున్నామన్నారు. ఇటీవల పరిశోధనా స్థానంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఆయన వివరించారు.

రైతులకు అందుబాటులో వాతావరణ వివరాలు

ఆచార్య ఎనీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా గిరిజన రైతులకు వాతావరణ ఆధారిత సలహాలను ఎప్పటికప్పుడు అందిస్తున్నా మన్నారు. దీని కోసం గ్రామీణ వ్యవసాయ వాతావరణ సేవా పథకం (జీకేఎంఎస్) అమలు చేస్తున్నామని చెప్పారు. రాబోయే ఐదు రోజుల్లో అల్లూరి జిల్లాలోని అన్ని మండలాల్లో వాతావరణం ఎలా ఉండబోతుందన్న సమాచారాన్ని ఈ కేంద్రం ద్వారా ముందుగానే తెలుసుకుని ఆ వివరాలను రైతులకు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. వాతావరణ వివరాలను ముందుగా తెలుసు కోవడం వల్ల రైతులు వ్యవసాయపరంగా తగిన ముందు జాగ్రత్తలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. తాజాగా పరిశోధనా స్థానం ముఖద్వారం వద్ద ఏ రోజు వాతావరణ వివరాలను ఆ రోజే ఎప్పటికప్పుడు డిజిటల్ తెరల ద్వారా తెలుసుకునేందుకు తగిన ఏర్పాట్లు చేశామని వివరించారు.

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానంలో సేంద్రియ విధానంలో సాగు

గిరిజన ప్రాంతాల్లో రైతులంతా సేంద్రియ పద్ధతిలోనే వరిసాగు చేపడు తున్నారు. అక్కడక్కడా కొద్ది మంది రైతులు రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారు. అల్లూరి జిల్లా మొత్తాన్ని పూర్తిగా ఆర్గానిక్ జోన్ గా పరిగణించాలన్న కలెక్టర్ ఆదేశాల మేరకు తాము సైతం పరిశోధనా క్షేత్రాల్లో అన్ని రకాల పంటలనూ పూర్తిగా ప్రకృతి, సేంద్రియ విధానంలోనే పండిస్తున్నామన్నారు. గిరిజన ప్రాంతాల్లో రైతులు పండించే వరి పంటను పూర్తిగా సేంద్రియ వరిగా గుర్తిస్తే అదనపు ఆదాయం సమకూరుతుందని పేర్కొన్నారు. దీనికి అవసరమైన చర్యలు వ్యవసాయశాఖలు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మరో శాస్త్రవేత్త డాక్టర్ హుస్సేన్ రెడ్డి, ఆదర్శ రైతు వండలం బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

13వందల 68రోజులు పూర్తిచేసుకున్న అమ్మ అన్నప్రసాద వితరణ

నేడు అమ్మ కల్యాణం

విశాలాంధ్ర-పార్వతీపురం: జిల్లా కేంద్రంలోని జిల్లాప్రభుత్వాసుపత్రి ఆవరణలో రోగులకు, రోగులబంధువులైన పేదలకు పట్టెడన్నంపెట్టేందుకు శ్రీకారం చుట్టిన జిల్లెల్లమూడి అమ్మ సేవాసమితి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి ఆదివారంతో 1368 రోజులు పూర్తిచేసుకున్నామని సంస్థఅధ్యక్షులు గంటేడ సోమేశ్వరరావు, కార్యదర్శి చిన్నమునాయుడులు తెలిపారు. ఆదివారంనాడు వారు జిల్లా ఆసుపత్రిలో మాట్లాడారు. నేడు సోమవారం అమ్మ కళ్యాణాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. వర్షాలు పడుతున్న సందర్భంగా గిరిజన మహిళలకు గొడుగులు అందజేసినట్లు తెలిపారు.నేడు అమ్మ కళ్యాణం సందర్భంగా ఆమె ఆశయాలను, లక్ష్యాలను పలువురికి తెలిపి అన్న ప్రసాద కార్యక్రమాన్ని, సేవా కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు.విశ్వజనని జిల్లెల్లమూడి అమ్మ దివ్యఆశీస్సులతో, దివ్యసంకల్పంతోపాటు, జిల్లెల్లమూడి అమ్మ సన్నిధిలో చదువుకొని, పదవీవిరమణచేసిన పూర్వ విద్యార్థులైన అమ్మబిడ్డలు, దాతల సహాయ సహకారాలతో నిర్విఘ్నముగా నిరాటకముగా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఒక్కరోజు కూడా ఆగకుండా కార్యక్రమాన్ని సభ్యులమంతా కలిసికట్టుగా నిర్వహిస్తున్నామన్నారు. దీంతోపాటు పలు సేవా కార్యక్రమాలను కూడా తమ సంస్థ ద్వారా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నీకున్నది తృప్తిగాతిని ఇతరులకు ఆదరంగా పెట్టుకో అన్న అమ్మ ఆశయాన్ని నెరవేర్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పదిమంది పేదలకు అమ్మ అన్న ప్రసాద వితరణ కార్యక్రమం పేరట కార్యక్రమాన్ని నిర్వహించడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. అమ్మ దివ్య ఆశీస్సులతో కార్యక్రమాన్ని నిరాటకముగా నిర్వహించేందుకు నిరంతరము కృషి చేస్తున్నట్లు తెలిపారు. అమ్మ అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తూ పలువురు చేయూత అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులతో పాటు సభ్యులు బడే శ్రీరాములు, బల్ల అడవినాయుడు, శ్రీరామ్మూర్తి నాయుడు, దాలినాయుడు, శీలంకి త్రినాధ రావు, పి చిన్నమునాయుడు, జి అప్పలరాజు, ఏ సర్వేశ్వరరావు, బి సత్యనారాయణ, డి గణపతి రావు, బి గౌరినాయుడు, పైడిరాజు, జగన్నాథం నాయుడు, త్రినాధ రావు, కృష్ణారావు తదితరులు పాల్గొని అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ..

తడారిన గొంతుకలకు తీపి కబురు

చింతపల్లికి జలజీవన్ మిషన్ ద్వారా త్రాగునీటి ప్రాజెక్టు నిర్మాణానికి 22 కోట్ల రూపాయలు నిధులు విడుదల.

కుమ్మరివంచుల వాగు నీరు శుద్ధిచేసి సరఫరా

ఐదు పంచాయతీలలో 98 గ్రామాల ప్రజలకు తీరనున త్రాగునీటి కష్టాలు

పనుల నిర్మాణానికి టెండర్లు పిలిచిన గ్రామీణ నీటిపారుదల శాఖ

విశాలాంధ్ర-చింతపల్లి: మండలంలోని ప్రజల తాగునీటి కష్టాలు తీరనున్నాయి. మేజర్ పంచాయితీ అయిన చింతపల్లి తో పాటు నాలుగు పంచాయతీల ప్రజల దాహార్తిని తీర్చేందుకు భారీ త్రాగునీటి ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. నిర్మాణాలకు అవసరమైన రూ.22 కోట్ల జల్ జీవన్ మిషన్ నిధులను విడుదల చేసింది. కొత్తపల్లి జలపాతం, తాజంగి రిజర్వాయర్ నుంచి దిగువకు వస్తున్న కుమ్మరివంచుల వాగు నీటిని శుద్ధి చేసి ప్రజలకు త్రాగు నీటి సరఫరా చేయనున్నారు. ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభించేందుకు గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారులు టెండర్లు ఆహ్వానించారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే 98 గ్రామాల గిరిజనులకు పుష్కలంగా తాగునీరు అందుతుంది. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన ప్రాంతంలో తాగు నీరు, రహదారులు, పక్కా గృహాల నిర్మాణా లకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. దీనిలో భాగంగా చింతపల్లి మండల కేంద్రం ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు గ్రామీణ నీటిపారుదల శాఖ (ఆర్ డబ్ల్యూఎస్) ఇంజనీరింగ్ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వం రెండు నెలల వ్యవధిలోనే ఆమోద ముద్రవేసి త్రాగు నీటి ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేసింది. చింతపల్లి మండల కేంద్రంలో పది వేల మంది, పరిసర గ్రామాల్లో ఎనిమిది. వేల మంది. తమ్మంగుల, అన్నవరం, చౌడుపల్లి, కుడుముసారి పంచాయతీ పరిధిలో 16 వేల మంది ఆదివాసీలు నివాసముంటున్నారు. మండల కేంద్రం ప్రజలకు పదేళ్ల క్రితం నిర్మించిన సీపీడబ్ల్యూ పథకం ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. రోజు రోజుకి పెరుగుతున్న జనాభా కారణంగా ఈ పథకం ద్వారా ప్రజలందరికి పూర్తిస్థాయిలో త్రాగు నీటి సరఫరా జరగడం లేదు. ఏప్రిల్ నుంచి కుమ్మరివంచుల వాగు వద్ద ఇన్ఫిల్టరేషన్ వాగు నిర్మాణానికి మట్టి పరీక్షలు నిర్వహిస్తున్న టెక్నికల్ సిబ్బంది జూన్ రెండో పక్షం వరకు చింతపల్లి ప్రజలు తీవ్ర స్థాయిలో త్రాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. సీపీడబ్ల్యూ పథకానికి నీటి సరఫరా చేసే బావులు అడుగంటిపోవడం వల్ల పంచాయతీ, ఆర్ డబ్ల్యూఎస్ అధికారులు ట్యాంకర్లతో వీధుల్లో నీటి సరఫరా చేయాల్సి వస్తున్నది. తమ్మంగుల, అన్నవరం, చౌడుపల్లి, కుడుము సారె పంచాయతీ పరిధి గిరిజనులు త్రాగునీటి కోసం ఊటగెడ్డలు, బావులు, చేతి పంపులను ఆశ్రయిస్తున్నారు. ఆదివాసీలకు రక్షిత త్రాగునీరు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చింతపల్లికి త్రాగునీటి ప్రాజెక్టును మంజూరు చేసింది.

కుమ్మరివంచుల వాగు వద్ద ఇన్ ఫిల్టరేషన్ బావి నిర్మాణం

చింతపల్లితో పాటు మరో నాలుగు పంచా యతీల ప్రజలకు సాయిబాబా ఆలయం కొండపై చింతపల్లి సీపీడబ్ల్యూ పథకం త్రాగునీటి ట్యాంక్ నుంచి త్రాగు నీరు సరఫరా చేసేందుకు కొత్తపల్లి జలపాతం, తాజంగి రిజర్వాయర్ నుంచి దిగువకు వస్తున్న నీరు కలిసే కుమ్మరివంచుల వాగు వద్ద నీటిని శుద్ధి చేసేందుకు ఇన్ఫల్టరేషన్ బావిని నిర్మించనున్నారు. ఆరు మీటర్ల చుట్టుకొలత కలిగిన ఇన్ ఫిల్టరేషన్ బావి నిర్మిస్తారు. కొత్తపల్లి జలపాతం, తాజంగి రిజర్వాయర్ నుంచి వచ్చే నీటిని ఇన్ ఫిల్టరేషన్ బావికి మళ్లించి నీటిని శుద్ధి చేస్తారు. శుద్ధి చేసిన నీటిని కోటగున్నలు కొండపైన నిర్మించే గ్రౌండ్ లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వైర్(జీఎల్బీఆర్)కి పంపింగ్ చేస్తారు. ఈ జీబీఎస్ఆర్ పరిధిలో సుమారు 45 గ్రామాలకు నీటి సరఫరా జరుగుతుంది. కోటగున్న లు జీఎల్బీఆర్ కి వచ్చిన నీటిని పంప్-1కి తరలించి బైలుకించంగి కొండపై నిర్మించనున్న రెండవ జీబీఎస్ఆర్కి తరలిస్తారు. బైలుకించంగి రెండోవ జీబీఎల్ఆర్ పరిధిలో 47 గ్రామాలకు నీటి సరఫరా చేస్తారు. అలాగే బైలుకించంగి రెండోవ జీబీఎస్ఆర్కి వచ్చిన నీటిని పంప్-2 ద్వారా చింతపల్లి మండల కేంద్రం సాయిబాబా దేవాలయం కొండపైన నిర్మించనున్న మూడవ జీబీఎస్ఆర్ కి సరఫరా చేస్తారు. చింతపల్లి మూడవ జీబీఎల్ఆర్ ద్వారా మండల కేంద్రంతో పాటు ఆరు గ్రామాలకు నీటి సరఫరా చేయనున్నారు. ఒక్కొక్క జీబీఎల్ఆర్ పరిధి గ్రామాల్లో వాటర్ ట్యాంక్లు నిర్మిస్తారు. జీబీఎల్ఆర్ నుంచి వాటర్ ట్యాంక్లకు నీటి సరఫరా చేసి, అక్కడ నుంచి వ్యక్తిగత కొళాయిల ద్వారా ప్రతి కుటుంబానికి త్రాగునీరు అందించనున్నారు.

రెండేళ్లలో నిర్మాణాలు పూర్తి

త్రాగునీటి ప్రాజెక్టు భారీ ది కావడంతో రెండేళ్లలో నిర్మాణాలు పూర్తి చేసేందుకు గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. కుమ్మరివంచుల గ్రామంలో ఇన్ఫిల్టరేషన్ బావి నిర్మాణానికి ఇంజనీరింగ్ అధికారులు ఇప్పటికే మట్టి పరీక్షలు నిర్వహించారు. ఇన్ ఫిల్టరేషన్ బావి, జీబీఎల్ఆర్లు, గ్రామాల్లో త్రాగునీటి ట్యాంక్ ల నిర్మాణం, ప్రతి గృహానికి ట్యాప్ కనెక్షన్ ఇచ్చేందుకు ఇంజనీరింగ్ అధికారులు సర్వే చేపట్టి ప్రణాళికలు రూపొందించారు. నీరు శుద్ధి చేయడం నుంచి కొళాయిల ద్వారా నీరు అందించే వరకు వివిధ స్థాయిలో చేపట్టాల్సిన పనుల బ్లూ ప్రింట్లను ఇంజనీరింగ్ అధికారులు సిద్ధం చే శారు.

త్రాగునీటి ప్రాజెక్టు నిర్మాణానికి టెండర్లు పిలిచాం

త్రాగునీటి ప్రాజెక్టు నిర్మాణానికి టెండర్లు పిలిచామని టెండర్ల పక్రియ పూర్తికాగానే పనులు ప్రారంభిస్తామని,. రెండేళ్లలో ఈ ప్రాజెక్టు ప్రజలు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తే చింతపల్లితో పాటు మరో నాలుగు పంచాయతీల ప్రజలకు నీటి సమస్య పూర్తి స్థాయిలో తీరుతుందని గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి కలెక్టర్, ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ చూపినట్లు గ్రామీణ నీటిపారుదల శాఖ ఏఈ గడుతూరి స్వర్ణలత తెలిపారు.

వాయిదా పడ్డ డోకులూరు లేటరైట్ ప్రజా అభిప్రాయసేకరణ

ప్రజాభిప్రాయ సేకరణ సభకు తరలివచ్చిన గిరిజన సంఘాల నాయకులు

విశాలాంధ్ర-జికె విధి: మండలంలోని పెదవలస పంచాయతీ డోకులూరు గ్రామంలో ఎర్రమట్టి క్వారీ తవ్వకాల కోసం పలువురు దరఖాస్తు చేసుకోగా దాని కొరకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించేందుకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి కోకితపాడు డోకులూరు మారుమూల గ్రామల ప్రజలు,గిరిజన సంఘ లు,మండల పీసా కమిటీలు వివిధ పార్టీలో నాయకులు తరలిరాగా రెండవ రోజు బంద్ కారణంగా ముఖ్య అధికారులు ప్రతినిధులు రాకపోవడంతో అర్ధాంతంగా వాయిదా పడడంతో పరిసర గ్రామాల రైతులు వెనుతిరిగారు.ఈ లేటరైట్ తవ్వకాల జరిగితే మా భూములు కోలుపోతున్నామని కొందరు రైతులు మరికొందరు పరవాలేదని రెండు వర్గాలుగా వారి అభిప్రాయాలు వెళ్లబుచ్చుకునేందుకు అధికారులు రాలేదని పలువురు రైతులు తెలిపారు. ఈ సమావేశానికి వచ్చిన గూడెం కొత్త వీధి తహసిల్దార్ టి రామకృష్ణ మాట్లాడుతూ రెండవ రోజు బంద్ కారణం చేతనే ముఖ్య అధికారులు రాకపోవడంతో తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని గూడెం తెలిపారు.

కంబాల శ్రీనివాసరావు సమక్షంలో బీజేపీలోకి భారీ చేరికలు

నూగు మామిడిలో జరిగిన కార్యక్రమంలో 250 మంది చేరిక

విశాలాంధ్ర-గంగవరం: మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీతోనే దేశ అభివృద్ధి సాధ్యమని, విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు అన్నారు. గంగవరం మండలం నూగు మామిడి గ్రామంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో గంగవరం, అడ్డతీగల మండలాలకు చెందిన 250 మంది గిరిజనులు కంబాల శ్రీనివాసరావు సమక్షంలో భారతీయ జనతా పార్టీ లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి కంబాల శ్రీనివాసరావు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ నాయకత్వంలోనే మన దేశం సురక్షితంగా ఉంటుందనే, నమ్మకంతోనే భారతీయ జనతా పార్టీలోకి ప్రజలు చేరుతున్నారని అన్నారు. రంపచోడవరం, జగ్గంపేట, రాజానగరం మూడు నియోజకవర్గాల్లో 160 గ్రామాలకు సొంత డబ్బులు ఖర్చు పెట్టి పలు ప్రజాసేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నానన్నారు. ఏజెన్సీ ప్రాంతం అంటే తనకు ఎంతో అభిమానం అన్నారు. డబ్బు సంపాదన కోసం రాజకీయాల్లోకి రాలేదని, ప్రజలకు మరింత సేవ చేయాలని లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చినట్లు వెల్లడించారు. రాష్ట్ర అధ్యక్షులురాలు దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోమ వీర్రాజు నాయకత్వంలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఏజెన్సీ ప్రాంత అభివృద్ధికి నా వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఆర్ బీజేపీ జిల్లా కార్యదర్శి స్వప్న కుమారి, మోహనపురం సర్పంచ్ కురసం అక్కమ్మ, గోకవరం బిజెపి మండల అధ్యక్షులు ఇనకోటి బాపన్న దొర, రామసేన సభ్యులు, బిజెపి నాయకులు దాసరి ధర్మరాజు, బత్తుల నానాజి, పసల నరేష్, వనవాసి జిల్లా అధ్యక్షులు కాటం రెడ్డి, శ్రావణ్ కుమార్, వెంకటలక్ష్మి మాజీ సర్పంచ్, అబ్బాయి రెడ్డి,కరణం కోటేశ్వరరావు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు..

అంగరంగ వైభవంగా మోదకొండమ్మ తల్లి అమ్మవారి జాతర ప్రారంభం

విశాలాంధ్ర-హుకుంపేట: మన్యం వాసుల దైవం శ్రీ శ్రీ మోదకొండమ్మ తల్లి జాతర మహోత్సవములు మండల కేంద్రంలో ఆదివారం నుండి ప్రారంభమైంది.మూడు రోజులపాటు జరగనున్న శ్రీ శ్రీ మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవంలో ముఖ్య అతిథిగా హాజరై నా అరకు ఎమ్మెల్యే రేగం మత్య లింగం, అమ్మవారి ఘట్టాల. ను మోసి శతకం పట్టు వద్ద చేర్చి ప్రత్యేక పూజలు చేస్తూ, ప్రాంత ప్రజలకు అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నారు. స్థానిక అమ్మవారి ఆలయం నుండి ఘటాలు ఊరేగింపు బ్యాండ్ మేళాలతో దింస నృత్యాలతో అతి వైభవంగా శతకం పట్టు వద్ద ప్రతిష్టించారు.మూడు రోజులపాటు జరిగే జాతర ఉత్సవాలలో అనేక సాంస్కృతి కార్యక్రమాలతో పాటు జాతరకు వచ్చే భక్తులకు ఎటువం టి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలను ఉత్సవ కమిటీ ఏర్పా ట్లు చేసింది. జాతర సమయంలో ఎటువంటి సంఘటనలు జరగకుం డా పోలీస్ శాఖ వారు గట్టి బందో బస్తు ఏర్పాటు చేశారు. జాతరకు ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకర ణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది .ఈ కార్యక్ర మంలో అల్లూరి సీతారా మరాజు జిల్లా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు బత్తిరి రవిప్రసా ద్ , వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాంగి అనిల్ గారు, స్థానిక సర్పంచ్ సమీడా వెంకటపూర్ణిమ , అరకు అసెంబ్లీ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ఐటీ విభాగం ఇంచార్జ్ కాపు మాధవరా వు ,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తాండవిస్తోన్న అపారిశుధ్యం

విశాలాంధ్ర -బెలగాం: పార్వతీపురం పట్టణంలోని సౌందర్య నారాయణమూర్తి నగర్ (ఎస్ఎన్ఎం నగర్) లో అపారిశుధ్యం తాండవిస్తోంది. పేరుకే మునిసిపల్ అప్రోవ్డ్ లే అవుట్ కాలనీ. సౌకర్యాలు మాత్రం అంతంత మాత్రంగానే ఉన్నాయి. ప్రధానంగా ఇక్కడ కాలువలు లేకపోవడంతో తీవ్ర సమస్యలు ఎదురవుతు న్నాయి. ఇక్కడ కొన్ని లైన్లలో పక్కా కాలువలు ఉండగా మరికొన్ని లైన్లలో కాలువలు వేయలేదు. పూడిక నిండిపోవడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తూ చిన్నపాటి వర్షానికి దుర్గంధం వెదజల్లుతోంది. చినుకు పడితే వర్షం నీరు మొత్తం రోడ్లపై ప్రవహిస్తూ ఈ ప్రాంతం మినీ డంపింగ్ యార్డ్ ల తయారవుతుంది. లేఔట్ లో పార్క్ కోసం ఉంచిన స్థలంలో వర్షపు నీరు చేరి చెరువును తలపిస్తోంది. వర్షం తగ్గాక ఇది మరో మినీ డంపింగ్ యార్డ్ ల మారి అవస్థలకు గురిచేస్తుంది. గతంలో ప్రజాప్రతినిధులు అధికారులు వచ్చి ఈ కాలనీని పార్కును అభివృద్ధి చేసి మోడల్ కాలనీగా తీర్చిదిద్దుతామని ప్రకటిస్తూ 50 లక్షల రూపాయలు కూడా మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అయినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి పనులు చేయలేదు. ఒకవైపు అభివృద్ధి పనులు లేక మరోవైపు డంపింగ్ యార్డులా మారి సమస్యగా మారుతుంది ఎస్ఎన్ఎం నగర్ కాలనీ. కానీ వర్షం వస్తే చిన్నపాటి మురికివాడ. అలాగే టౌన్ లో ఉన్న ఏకైక మునిసిపల్ పార్క్ ఎస్ఎన్ఎం నగర్ కాలనీలో ఉంది. 50లక్షల రూపాయలు కాలనీలో మౌలిక సదుపాయాలు అభివృద్ధి కోసం మంజూరైనట్లు ఎమ్మెల్యే విజయ్ చంద్ర, జిల్లా కలెక్టర్, అప్పటి మునిసిపల్ కమీషనర్ కోన శ్రీనివాస్ కాలనీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించినపుడు అందరూ ప్రకటించారు. కానీ ఇంతవరకు ఒక్కఅడుగు ముందుకు పడలేదు. వర్షం కురిసింది అంటే చాలు ప్రధాన రహదారి అంతా మునిసిపల్ కాలువలు రోడ్లపై ప్రవహిస్తాయి. పార్క్ లో వర్షపు నీరు నిల్వ ఉండిపోయి వర్షం తగ్గిన తరువాత పార్క్ అంతా దుర్గంధంతో వాసన చిన్న చెత్త కుప్పలా తయారవుతుంది. కాలనీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. టౌన్ లో ఉన్న ఏకైక పార్క్ ను డెవలప్మెంట్ చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. మునిసిపల్ అధికారులు పన్నులు వసూలపై ఉన్న శ్రద్ధ కాలనీ అభివృద్ధి పై దృష్టి సారించడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. అలాగే మొక్కలు నాటారు గానీ వాటి సంరక్షణ గాలికొదిలేశారు. ఆ మొక్కలు ఎండకు ఎండి వానకు తడిసి పశువులు కొన్ని తిని మొండేలు మిగిలాయి. ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టి సారించి కాలనీని అభివృద్ధిపరచి మోడల్ కాలనీగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

జనసేన క్రియాశీలక కిట్లు పంపిణీ

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : మండలంలోని జనసేన పార్టీ క్రియాశీలక కిట్లను ఆ పార్టీ ఐటీ కోఆర్డినేటర్ రంజిత్ కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాలలో 53 మంది క్రియాశీలక వాలంటీర్లతో పాటు 2580 మంది పార్టీ సభ్యత్వం నమోదు చేసుకోవడంతో సంతోషంగా ఉందని ఆయన అన్నారు. ఈ తొలి ప్రక్రియలో తొలి మూడు స్థానాలలో నాతోపాటు ద్వారపూడి శంకర్రావు బోను శివ ఉన్నారని చెప్పారు. ప్రతి ఒక్క జనసేన కార్యకర్త పార్టీ బలోపేతానికి జన సైనికుల్లా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

తిరుపతిలో లెర్నింగ్ సెంటర్ ప్రారంభించిన వేదాంతు

విశాలాంధ్ర -విశాఖపట్నం: భారతదేశంలోని ప్రముఖ విద్యా వేదిక అయిన వేదాంతు తిరుపతిలోని న్యూ మారుతి నగర్లో సరికొత్త లెర్నింగ్ సెంటర్ ను ఏర్పాటు చేస్తుంది. తాజా వేదాంతు లెర్నింగ్ సెంటర్ని ప్రారంభించడం ద్వారా అధిక-నాణ్యత గల విద్యను మరింత సరసమైనదిగా మరియు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యం వైపు ముఖ్యమైన అడుగు వేస్తున్నట్లు అయ్యింది. ప్రతి విద్యార్థి యొక్క పూర్తి సామర్థ్యాన్ని బయటకు తీసుకువచ్చేది ఉపాధ్యాయుడే. అలాంటి ఉపాధ్యాయుడు అందించే బోధన అద్భుతంగా ఉండాలని బలంగా నమ్ముతోంది వేదాంతు. అందుకే అదే లక్ష్యంతో అభ్యాస నమూనా అత్యాధునిక సాంకేతికత, డేటా-ఆధారిత బోధన మరియు వ్యక్తిగతీకరించిన మార్గదర్శకత్వాన్ని మిళితం చేసి ప్రభావవంతమైన అభ్యాస అనుభవాలను అందిస్తుంది. భారతదేశం అంతటా 100 శాతం ఆఫ్లైన్ కేంద్రాల వేగంగా విస్తరిస్తున్న నెట్వర్క్ తో, జేఈఈ, నీట్ మరియు స్టేట్ బోర్డ్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు వ్యక్తిగతీకరించిన విద్య కోసం వేదాంతు కొత్త బెంచ్మార్క్ ను నిర్దేశిస్తోంది. ప్రతీ ఒక్కరికీ ప్రేరణ ఇచ్చేందుకు సొంత ప్రాంతానికి ఈ సరికొత్త లెర్నింగ్ సెంటర్ ప్రారంభం చేసినట్టు వేదాంతు సహ వ్యవస్థాపకుడు వంశీ కృష్ణ తెలిపారు.

ఉత్సవంగా మాడుగులమ్మ ఉత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర-జి.మాడుగుల: మండల కేంద్రంలో వెలిసిన శ్రీ మత్స్యమాడుగులమ్మ ఉత్సవాలు ఈ నెల 4 నుంచి 6 వరకులో భాగంగా ఆదివారం మొదటి రోజు భక్తి శ్రద్ధాలతో ప్రారంభమైంది. ఉదయం మత్స్యరాస వంశీయులు మాజీ మంత్రులు బాలరాజు, మణికుమారి అమ్మవారి ఘటాలను తలపై మోసుకు వెళ్లి స్థానిక రామాలయం సతకం పట్టు వద్ద ప్రతిష్టించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మూడు రోజుల పాటు నిర్వహించే జాతరకు భక్తులకు అన్ని సౌకర్యాలు సమకూర్చినట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు మత్స్యరాస రామారాజు, గసాడి రెడ్డిబాబు తెలిపారు. మూడు రోజులు పాటు పలు సంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తునట్లు స్పష్ట చేశారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా గట్టి నిఘా ఉంచినట్లు స్థానిక పోలీసులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షులు మత్స్యరాస వెంకట గంగరాజు, మత్స్యరాస లక్ష్మిపతిరాజు, అర్జున్‌రావు, వడ్డాది శ్రీనివాస్ భక్తులు పాల్గొన్నారు.

శామ్‌సంగ్ యొక్క ఫ్యాబ్ గ్రాబ్ ఫెస్ట్ ప్రారంభం

విశాలాంధ్ర -విశాఖపట్నం : భారతదేశపు అతిపెద్ద వినియోగదారుల ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్ తన బ్లాక్‌బస్టర్ సేల్ 'ఫ్యాబ్ గ్రాబ్ ఫెస్ట్'ను మళ్లీ తెస్తోంది. మే 1నుంచి ప్రారంభమయ్యే ఈ ఆసక్తికరమైన షాపింగ్ ఉత్సవం, శామ్‌సంగ్ అత్యాధునిక ఉత్పత్తులపై అద్భుతమైన మరియు పరిమిత కాలం కోసం అందించే ప్రత్యేక ఆఫర్లను తీసుకురానుంది. ఈ ఆఫర్లు ప్రత్యేకంగా సాంసంగ్ డాట్ కామ్, శామ్‌సంగ్ షాప్ యాప్ మరియు శామ్‌సంగ్ ఎక్స్క్లూజివ్ స్టోర్లలో లభిస్తాయి. స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లపై భారీ డిస్కౌంట్లు శామ్‌సంగ్ గ్యాలక్సీ ఎస్, గ్యాలక్సీ జెడ్ మరియు గ్యాలక్సీ ఏ స్మార్ట్‌ఫోన్ సిరీస్ యొక్క ఎంచుకున్న మోడళ్లపై వినియోగదారులు 41 శాతం వరకు తగ్గింపును పొందవచ్చు. ఇది సరికొత్త ఫోల్డబుల్స్ అయినా లేదా శక్తివంతమైన కెమెరా-సెంట్రిక్ మోడల్స్ అయినా, ప్రతి టెక్ ఔత్సాహికులకు ఏదో ఒకటి ఉంటుంది. అదనంగా, ఎంచుకున్న గ్యాలక్సీ టాబ్లెట్లు, ఉపకరణాలు మరియు ధరించగలిగినవి 50 శాతం వరకు తగ్గింపుతో లభిస్తాయి, ఇది మీ గ్యాలక్సీ పర్యావరణ వ్యవస్థను పూర్తి చేయడానికి సరైన సమయం. బహుముఖ టాబ్లెట్ లాంటి అనుభవాన్ని కోరుకునే వినియోగదారులు ఎంచుకున్న గ్యాలక్సీ బుక్ 5 మరియు బుక్ 4 ల్యాప్‌టాప్‌పై 35 శాతం వరకు తగ్గింపును పొందవచ్చు మరియు గ్యాలక్సీ ఏఐ తో వారి వర్క్‌ఫ్లో పెంచవచ్చు.